సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 3 । జనవరి । 2025



టన్ను చీనీ రూ.28,190

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28,190, కనిష్టంగా రూ.11 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి టమాట మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.5 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.8°/11.4°

జిల్లా పరిధిలో గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

తెల్లనిదంతా కల్లు కాదు!

హిందూపురం నియోజకవర్గంలో ఈత చెట్లు దాదాపుగా 2 వేలు ఉన్నాయి. ఒక్కోచెట్టు నుంచి రోజుకు ఒకటిన్నర లీటర్ కల్లు ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన కేవలం 3 వేల లీటర్ల కల్లు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా రోజుకు 20 వేల లీటర్ల కల్లును అమ్ముతున్నారు. ఉత్పత్తి 3 వేల లీటర్లుంటే 20 వేల లీటర్ల కల్లును ఎలా అమ్ముతున్నారన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.



- కల్లు ఉత్పత్తి తక్కువ.. వినియోగం ఎక్కువ
- జిల్లా వ్యాప్తంగా జోరుగా కల్తీ కల్లు తయారీ
- అనారోగ్యం పాలవుతున్న కల్లు ప్రియులు
- ఇప్పటికే కొందరి ప్రాణాలు బలితీసుకున్న వైనం
- చక్రం తిప్పుతున్న అధికార పార్టీ నాయకులు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్‌శాఖ అధికారులు !

ఉమ్మడి 'అనంత' జిల్లాలో అనుమతులు ఇలా..

టీఎఫ్‌టీలు	: 340
కల్లు గీత కార్మికుల సంఘాలు	: 159
లైసెన్స్ కల్లు దుకాణాలు	: 495

హిందూపురం/హిందూపురం అర్బన్: ఈత వనాలు తగ్గిపోయాయి. కానీ గ్రామాలు, పట్టణాల్లో మాత్రం కల్లుకు కొదవ లేదు. ఉన్న ఈత వనాల నుంచి సహజ సిద్ధంగా ఉన్న కల్లు 5 శాతం అవసరాలు కూడా తీర్చడం లేదు. అలాంటిది ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎటు చూసినా కల్తీ కల్లు అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. హిందూపురం, కదిరి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, తదితర నియోజకవర్గాల్లో కల్లు అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురంలో కల్తీ కల్లు వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడి నుంచే వివిధ మండలాలకు కల్తీ కల్లును సరఫరా చేస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు.

రహస్య ప్రదేశాల్లో తయారీ..

రోజూ కల్లు తాగలేనిదే ఉండలేని వారు ఎంతో మంది ఉన్నారు. వారి వ్యసనాన్నే ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు కల్తీ కల్లు వ్యాపారాని తెరలేపారు. రహస్య ప్రదేశాల్లో హానికర రసాయనాలతో కల్లు తయారు చేయడం టెంపోలు, ఆటోల్లో తరలించి అమ్మకాలు చేస్తున్నారు. కల్తీ కల్లుకు అలవాటు పడ్డవారు రోజూ దాన్ని దాన్ని తాగలేక ఉండలేని పరిస్థితి తెచ్చుకొంటున్నారు. దీంతో కొంత కాలానికి ఆర్థికంగా చితికి పోవడమే కాకుండా ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రుల పాలవుతున్నారు. కొందరైతే అతిగా సేవించి ఎక్కడ పడితే అక్కడ పడి మతి స్థిమితం కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంతో మంది ప్రాణాలు కూడా కోల్పోయారు.



హిందూపురంలో విక్రయాల కోసం నింపి ఉంచిన కల్లు బాటిళ్లు



హిందూపురం ఎక్సైజ్‌శాఖ పరిధిలో కల్లు శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

కర్ణాటక నుంచే ఎక్కువ ..

కల్లు తాగేందుకు కర్ణాటక నుంచే ఎక్కువగా కల్లు ప్రియులు వస్తున్నారు. హిందూపురం, లేపాక్షి, పరిగి, చిలమత్తూరు మండలాలు కర్ణాటక సరిహద్దున ఉండటంతో కర్ణాటక నుంచి తెల్లవారకముందే కల్లు కోసం వచ్చి సేవించి వెళ్తుంటారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..

ఆరోగ్యాలపై ప్రమాదకర ప్రభావం చూపించే డైజోఫాం, క్లోరో హైడ్రేడ్, శాక్రిన్, అమ్మోనియం తదితర రసాయనిక మందులను కల్లులో కలిపి అమ్మకాలు చేస్తున్నారు. కల్తీ చేసిన కల్లు తాగిన రెండు నిమిషాల్లో నిషా నాశలానికి ఎక్కేవిధంగా చేస్తున్నారు. దీనికి అలవాటుపడిన కల్లు ప్రియులు దాన్ని విడిచిపెట్టలేక కల్లుకు బానిసలుగా మారి క్రమంగా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కల్తీ కల్లు తాగితే ఆలోచనశక్తి కోల్పోయి మతిమరుపు అధికమై కాలేయం దెబ్బతిని ప్రాణం మీదకు వచ్చే ప్రమాదం ఉందని వైదులు హెచ్చరిస్తున్నారు.

నాయకుల అండదండలతో..

కల్లు విక్రయ దుకాణాలకు సరైన అనుమతులు లేకపోయినా అధికార పార్టీ నాయకుల అండదండలతో కల్తీ కల్లు వ్యాపారం జోరుగా సాగుతోందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. వాస్తవంగా హిందూపురం పట్టణంలో 10 దుకాణాలకు అనుమతులు ఉండగా సుమారు 35 వరకూ దుకాణాలను నిర్వహిస్తున్నారు. అలాగే హిందూపురం మండలంలో ఐదింటికి అనుమతి ఉండగా సుమారు 24 దుకాణాల్లో కల్లు విక్రయాలు చేస్తున్నారు. అలాగే చిలమత్తూరు, లేపాక్షి, పరిగి మండలాల్లో కూడా అనుమతులను మించి దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

కల్తీ కల్లును అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలున్నాయి. కేవలం ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రం హడావుడి చేస్తూ ఆ తర్వాత మామూళ్లు తీసుకుంటూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని చెబుతున్నారు. కేవలం రికార్డుల నిర్వహణలో భాగంగా తనిఖీలకు వెళ్లినా ముందస్తుగా వ్యాపారులకు సమాచారం వెళ్లిపోతుండటంతో అక్రమార్కులు అలర్ట్ అయిపోతున్నారు. కేవలం శాంపిళ్లు సేకరించి చిత్తూరు ల్యాబ్‌కు పంపడం మినహా ఎక్సైజ్ సిబ్బంది చేసిందేమీ లేదన్న విమర్శలున్నాయి.

ప్రాణాలు తీస్తున్న కల్తీ కల్లు

- గత ఏడాది నవంబర్ 4వ తేదీన కర్ణాటక గుడిబండకు చెందిన రమేష్ పురంలో అతిగా కల్లు సేవించడంతో నోటి నుంచి నురగ కక్కుకొని చనిపోయినట్లు బంధువులు తెలిపారు.
- హిందూపురం పట్టణంలోని చిన్నమార్కెట్ సమీపంలో అతిగా కల్లు సేవించి ఓ వ్యక్తి నెల క్రితం మృతి చెందాడు. పోలీసులు కర్ణాటకకు చెందిన వ్యక్తిగా గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం తరువాత వారి బంధువులకు అప్పగించారు.
- నాలుగు నెలల క్రితం తూముకుంట సమీపంలో కల్లు తాగి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి మృతి చెందగా విషయం తెలుసుకున్న బంధువులు రాత్రికి రాత్రే మృతదేహాన్ని మధుగిరికి తీసుకెళ్లారు.
- రెండు నెలల క్రితం లేపాక్షి మండలంలో ఓ వృద్ధుడు కల్తీ కల్లుతాగి మృతి చెందగా.. గుట్టు చప్పుడు కాకుండా దహన సంస్కారాలు చేసేశారు.
- రెండు నెలల క్రితం చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి సమీపంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ సమయంలో ఓ కారులోని వారు అతిగా కల్లు తాగి వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



జిల్లా వ్యాప్తంగా ఉన్న కల్లు దుకాణాలను ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీ చేస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కల్లు దుకాణాల్లో శాంపిళ్లు సేకరిస్తున్నాం. వాటిని చిత్తూరు ల్యాబ్‌కు పంపుతున్నాం. కల్తీ కల్లు అని తేలితే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే ఉపేక్షించేది లేదు. కల్లు దుకాణదారులు నాణ్యమైన కల్లునే విక్రయించాలి.

– గోవిందనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

న్యూస్‌రీల్

తాత్కాలిక సీనియార్టీ జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్, ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల పరిధిలోని పాఠశాలలకు సంబంధించి పీఎస్ హెచ్‌ఎం, తెలుగు, హిందీ, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు తాత్కాలిక సీనియార్టీ జాబితా సిద్ధం చేశారు. https:// deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలుంటే శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు సరైన ఆధారాలతో హెచ్‌ఎం, ఎంఈఓల ద్వారా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

8న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 8న నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) ఆర్. రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సహా ఆయా స్థాయీ సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన స్థాయీ సంఘం-1, 2, 3, 4, 5, 6, 7(ఆర్థిక/ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి/ వ్యవసాయం/ విద్య, వైద్యం/మహిళా శిశు, సంక్షేమం/సాంఘిక సంక్షేమం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలు, ఇప్పుడు జరగబోయే సమావేశాల్లో సభ్యులు అడిగే సమస్యలకు సంబంధించి సమగ్ర సమాచారంతో అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ఎవరైనా గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

5న పెనుకొండకు కేంద్ర రైల్వే మంత్రి రాక !

పెనుకొండ: కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమణ్ణ 5వ తేదీన పెనుకొండకు రానున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. పెనుకొండ రైల్వే బ్రిడ్జిని రూ. 25 కోట్లతో నిర్మించారు. బ్రిడ్జిని ప్రారంభించేందుకు కేంద్ర మంత్రి వస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో బ్రిడ్జి మంజూరైంది. పనులు ఆలస్యం కావడంతో ఇప్పటికి పూర్తయింది. ఈ నేపథ్యంలోనే రైల్వే మంత్రి బ్రిడ్జిని ప్రారంభించనున్నారు.

స్కాట్ అండ్ గైడ్ టీచర్లకు శిక్షణ



శిక్షణా తరగతుల్లో ప్రారంభ ఉపన్యాసం చేస్తున్న ఎంఈఓ లక్ష్మీదేవి

పరిగి: దేశ సేవలో ప్రతి ఒక్కరూ తరించాలని ఎంఈఓ లక్ష్మీదేవి తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లిలో ఏపీ స్కూల్ ఆఫ్ రెసిడెన్షియల్ ఎక్సలెన్స్ పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి స్కాట్ అండ్ గైడ్స్‌పై ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఇటీవల పీఎంశ్రీ పాఠశాలలుగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాల్లో స్కాట్ అండ్ గైడ్స్‌పై జిల్లాలోని 27 పాఠశాలల స్కాట్ అండ్ గైడ్ టీచర్లకు వారం రోజుల పాటూ బేసిక్ శిక్షణా తరగతులను ఏపీఆర్‌ఎస్ కొడిగెనహళ్లిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశ భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటూ సమాజ సేవపై అవగాహన కల్పించడానికి చేపట్టాల్సిన కృత్యాలను శిక్షణా కార్యక్రమాల ద్వారా వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కాట్ అండ్ గేమ్స్ ట్యాగ్‌లను ముఖ్య అతిథులకు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, జిల్లా స్కాట్ సెక్రెటరీ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్: వైద్య ఆరోగ్యశాఖ కడప జోన్-4 పరిధిలోని స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రీజియన్ పరిధిలో 150 కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు నమూనా ఇతర వివరాలను https.cfw.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉందన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని భర్తీ చేసి జనవరి 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కడపలోని ప్రాంతీయ సంచాలకులు, వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

జిల్లాను ప్రగతిపథంలో నడిపిద్దాం



కలెక్టర్ చేతన్‌కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ అభిషేక్‌కుమార్, ఎస్పీ వి.రత్న

ప్రశాంతి నిలయం: కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పుష్ప గుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలసి వారు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఆర్‌ఓ విజయ సారథి, జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు కలెక్టర్‌లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు.

మెరుగైన సేవలు అందిద్దాం

పుట్టపర్తి టౌన్: కొత్త సంవత్సరంలో సమష్టిగా.. మరింత ఉత్సాహంతో ప్రజలు మెరుగైన సేవలు అందిద్దామని ఎస్పీ రత్న అధికారులకు సూచించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్న ఆధ్వర్యంలో డీపీఓ సిబ్బంది నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న సిబ్బందితో కలసి కేక్ కట్ చేశారు. జిల్లా క్యాంప్ కార్యాలయం అధికారులు, స్పెషల్ బ్రాంచ్, డీపీఓ సిబ్బంది, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సబ్ డివిజన్ల వారీగా పోలీస్ కార్యాలయానికి విచ్చేసి ఎస్పీని మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. పోలీసుల ప్రతిష్టను పెంచే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ కుమార్, శివన్నారాయణస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సీసీ రాఘువేంద్ర, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐలు వలి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు ఆపకపోతే ఉద్యమిస్తాం

- కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వరుస దాడులు
- పవన్‌కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదు?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

హిందూపురం: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులపై వరుసగా దాడులు చేస్తున్నారు. దీనికితోడు అక్రమ కేసు కూడా బనాయిస్తున్నారు. దాడులు ఆపకపోతే ఉద్యమానికి శ్రీకారం చుడతాం. వైస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడాల్సిన పనిలేదు. సమష్టిగా పార్టీ కోసం పనిచేయాలి. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది.' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. హిందూపురం సబ్ జైలులో ఉన్న ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, నాయకులతో కలసి ఉషశ్రీచరణ్ గురువారం పరామర్శించారు. అనంతరం ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలం పెద్దనపల్లిలో వెంకటరమణప్ప, మచ్చేంద్రప్ప,శివప్ప వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తుమని చెప్పారు. గ్రామంలో వారందరూ సౌమ్యంగా ఉండేవారేనని, అనవసరంగా చిలమత్తూరు టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి దాడి చేయడమే కాకుండా అధికార దర్పంతో వారిపై తప్పుడు కేసులు నమోదు చేయించి అరెస్టు చేయించడం దారుణమన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజు బూత్ వద్దకే వచ్చి వైఎస్సార్‌సీపీ నాయకులకు వార్నింగ్ ఇచ్చారని, ఇందులో భాగంగానే కేసులు నమోదు చేయించి జైళ్లలో పెట్టించారని విమర్శించారు. కక్ష సాధింపులు, రాజకీయ విద్వేషాలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను టార్గెట్‌గా చేసుకుని వివక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. అధికారం అనేది ఎవరికీ శాశ్వతం కాదని గ్రహించాలన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని సూచించారు. గతంలో తాము అధికారంలో ఉన్నా ఎవరిపై తప్పుడు కేసులు పెట్టలేదన్నారు. అలాంటి వాటిని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ ప్రోత్సహించలేదన్నారు. వివక్ష చూపకుండా, కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తూ రాష్ట్రంలో ఎటూ చూసినా అరాచకాలు సృష్టిస్తోందన్నారు. సోషల్ మీడియా ప్రతినిధులు ప్రశ్నించినా దాడులు, కేసులు నమోదుచేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రొద్దం మండలంలో కూడా వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలాజీపై కేసులు పెట్టారని చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారందరూ జైళ్లకు పోవాల్సిందేనా? అని ప్రశ్నించారు.

పవన్‌కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదు?..

కూటమి ప్రభుత్వ పాలనలో దాడులు జరుగుతున్నా, తప్పుడు కేసులు పెడుతున్నా డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శాంతి కోసం పాటు పడతానని, దాడులు, దౌర్జన్యాలకు దూరంగా ఉంటామని, రకరకాలుగా పలికే పవన్ కళ్యాణ్ ఇప్పుడేం చేస్తున్నారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులను ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. 'హిందూపురం కొల్లకుంటలో దాడి చేశారు. చిలమత్తూరు ఫ్యాక్టరీ వద్ద మహిళలపై అత్యాచారాలు జరిగాయి. ఇప్పుడు బీసీలపై దాడిచేసి తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారు. వారి నాయకులు, కార్యకర్తలను నియంత్రించకుండా ఎమ్మెల్యే బాలకృష్ణ ఇలాంటి వాటిని ప్రోత్సహించాడన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు విస్మరించి, కక్షసాధింపు చర్యలకు పాల్పడితే కూటమి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ కార్పోరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ శివ, మండల కన్వీనర్ రాము, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచు తెర



చిలమత్తూరు సమీపంలో మంచుతో కప్పుకున్న భైరవేశ్వరుడి ఆలయం

చిలమత్తూరు: జిల్లా వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంచు ప్రభావంతో చాలా ప్రాంతాల్లో ఉదయం 9 వరకూ సూర్యుడు కనిపించడం లేదు. చిలమత్తూరు మండలంలో రెండు రోజులుగా 18 డిగ్రీల కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొగమంచు కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పింఛన్లపై పకడ్బందీగా విచారణ



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్

ప్రశాంతి నిలయం: దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాల విచారణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, సెర్ప్ సీఈఓ వీరపాండియన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో పింఛన్ల విచారణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ చేతన్ వీసీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా వైద్యఆరోగ్యశాఖ, డీఆర్‌డీఏ, గ్రామ,వార్డు సచివాయల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1,715 మంది దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన కేటగిరిలో రూ.15 వేలు చొప్పున ప్రతి నెలా పింఛన్ పొందుతున్నారన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆ పింఛన్‌లపై విచారణ నిర్వహించాలన్నారు. వైద్య బృందాల పరిశీలనకు సూక్ష్మ ప్రణాళిక, రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని, కలెక్టర్ అధ్యక్షతన, డీఆర్‌డీఏ పీడీ కన్వీనర్‌గా, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్, డీఎంహెచ్ఓ, డీసీహెచ్‌ఎస్, జిల్లా లెప్రసీ ఆఫీసర్, డీపీఓ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ, గ్రామ,వార్డు సచివాయల నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్‌శాఖ ప్రతినిధులు మెంబర్లుగా ఉంటారన్నారు. మండల స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వైద్యుడు.. రోగి వైకల్యాన్ని అంచనా వేస్తారని, గ్రామ వార్డు సచివాలయాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ రేసర్ల బైండోవర్



యువకులు, వారి తల్లిదండ్రులను మందలిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి అర్బన్: స్థానిక ఔటర్ రింగ్ రోడ్డులో బైక్ రేసింగ్ చేస్తున్న నలుగురు యువకులను సీఐ నారాయణరెడ్డి అదుపులో తీసుకుని తహసీల్దారు వద్ద బైండోవర్ చేయించారు. ఈ సందర్భంగా మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. డీఎస్పీ శివనారాయణ స్వామి కౌన్సెలింగ్ ఇచ్చారు. 3 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి ఎంవీఐ వరప్రసాద్‌కు అప్పగించారు. కాగా, ఇదే ఘటనలో పరారీలో ఉన్న మరో ఏడుగురి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ స్టేషన్ సమీపంలో బైక్ అపహరణ

పుట్టపర్తి అర్బన్: స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలో పట్ట పగలే ఓ ద్విచక్ర వాహనాన్ని యువకుడు అపహరించుకెళ్లాడు. గురువారం ఉదయం ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన నారాయణస్వామి.. తన బిడ్డకు ఆరోగ్యం సరిగా లేక పోవడంతో సత్యసాయి జనరల్ ఆస్పత్రికి చికిత్స కోసం పిలుచుకొచ్చాడు. ఆ సమయంలో తన ద్విచక్ర వాహనాన్ని అర్బన్ పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో నిలిపి, ఆస్పత్రిలోకి వెళ్లి గంట తర్వాత బయటకు వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, పట్టపగలే పోలీస్ స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనం అపహరణకు గురికావడం పట్టణ వాసులను ఆందోళన కలిగించింది.

పాఠశాల ఆవరణలో క్షుద్ర పూజ



పూజలు చేసిన దృశ్యం

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం అర్ధరాత్రి క్షుద్రపూజలు చేశారు. ముగ్గు వేసి అందులో జంతువుల పుర్రె, కాళ్ల ఎముకలు ఉంచి పసుపు, కుంకుమ చల్లారు. గురువారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది అక్కడు చేరుకుని పరిశీలించారు. అక్కడి దృశ్యాలు చూసిన విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పుట్టపర్తి.. సమస్యలు జాస్తి

- జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాలు మృగ్యం
- వీధుల్లో పొంగి పొర్లుతున్న మురుగునీరు
- నిర్వహణ లేక రోడ్లన్నీ గుంతలమయం
- నిధులున్నా ఖర్చు చేయని యంత్రాంగం
- ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంలో అభివృద్ధి అథోగతి



డ్రైనేజీ మ్యాన్ హోల్ పొంగిపొర్లడంతో పుట్టపర్తి ప్రధాన రోడ్డు దుస్థితి




గుంతలమయమైన వెస్ట్‌గేట్ రోడ్డు

పుట్టపర్తి రూరల్: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ఖ్యాతిగాంచిన జిల్లా కేంద్రం పుట్టపర్తిలో అభివృద్ధి అథోగతిగా మారింది. ఇక్కడకు దేశవిదేశాల నుంచి సత్యసాయిభక్తులు నిత్యం వస్తుంటారు. ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని వెళ్తుంటారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా విద్య, వైద్యం, తాగునీరు వంటి మహత్తర సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 2004లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నాలుగు వరుసల రోడ్డు, చిత్రావతి సుందరీకరణ, టూరిజం గెస్ట్‌హౌస్, లేపాక్షి ఎంపోరియం, శిల్పారామం, పుట్టపర్తి మీదుగా హంద్రీ–నీవా కాలువ ఏర్పాటు జరిగాయి. బాబా సేవలకు గుర్తుగా 2022లో వైఎస్సార్ తనయుడు, అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇలాంటి తరుణంలో పుట్టపర్తి అభివృద్ధిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం విస్మరించింది. మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తిగా విఫలమైంది.

వీధులు దుర్గంధమయం..

పుట్టపర్తిలో దశాబ్దాల క్రితం అప్పటి ఆవాసాలకు అనుగుణంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జనాభా పెరిగిపోయింది. డ్రెయినేజీ మ్యాన్‌హోల్‌లు నిండిపోయి మురుగు పొంగిపొర్లుతోంది. ప్రధాన వీధుల్లో పారుతున్న మురుగు దుర్గంధం వెదజల్లుతూ అసౌకర్యం కలిగిస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధునాతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించారు. సత్యసాయి బాబా జయంతి, ఆరాధన ఉత్సవాల సమయాలలో ప్రధాన వీధుల్లో డ్రైనేజీ నీరు పొంగి పార్లాయి. దీంతో దేశవిదేశాలకు చెందిన భక్తులు తీవ్ర అసౌకర్యాలకు గురయ్యారు. చెత్త దిబ్బలు పెరిగి పందుల సంచారంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.



చిత్రావతి నదిలో కలుస్తున్న మురుగునీరు

కలుషితమవుతున్న చిత్రావతి..

ప్రపంచ నలుమూలల నుంచి పుట్టపర్తికి విచ్చేసే సత్యసాయి భక్తులు బాబా నడయాడిన చిత్రావతి నదిని, అందులో పారుతున్న నీటిని ఎంతో పవిత్రంగా భావిస్తారు. నదిలో స్నానాలు ఆచరించడం, కర్మకాండలు, పిండ ప్రదానం, అస్థికలు కలపడం ఆనవాయితీగా నిర్వహిస్తూ వస్తున్నారు. అంతేకాక నదీ జలాలను, ఇసుకను ఎంతో పవిత్రంగా భావిస్తూ తమ ఇళ్లకు తీసుకెళుతుంటారు. అంతటి పవిత్రత కలిగిన చిత్రావతి నదిలో డ్రైనేజీ మురుగు నీరు కలుస్తున్నా అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

రోడ్లన్నీ గుంతలమయం..

ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ రోడ్డు, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి రోడ్డు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఈస్ట్ రోడ్డు, బీడుపల్లి రోడ్డు, కమ్మవారిపల్లి రోడ్లు నిర్వహణకు నోచుకోక గుంతలమయమయ్యాయి. దీంతో పాదచారులు, వాహన చోదకులు, గిరిప్రదక్షిణ చేసే సత్యసాయి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల సమయానికైనా ఈ రోడ్లకు మోక్షం దక్కుతుందో? లేదో! అని భక్తులు, స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



పుట్టపర్తి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. వివిధ అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్ల పనులు చేపట్టలేకపోతున్నాం. దీంతో సకాలంలో నిధుల వినియోగం జరగలేదు. వీలైనంత త్వరలో అభివృద్ధి పనులు చేపడతాం.

– ప్రహ్లాద్, కమిషనర్, పుట్టపర్తి మున్సిపాలిటీ

వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం

- తలనొప్పి అంటూ వెళితే సూది మందు ఇచ్చిన వైనం
- చికిత్స పొందుతూ వివాహిత మృతి



జ్యోతిబాయి

గుమ్మఘట్ట/బ్రహ్మసముద్రం: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి ఓ వివాహిత మృతి చెందింది. వివరాలు... బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డి గ్రామానికి చెందిన జ్యోతిబాయి (31) రెండు రోజుల క్రితం తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుంటే కుటుంబసభ్యులు గుమ్మఘట్ట మండలం భూపసముద్రంలోని ఆర్‌ఎంపీ చిరంజీవి వద్దకు పిలుచుకెళ్లారు. పరిశీలించిన ఆర్‌ఎంపీ ఆమెకు ఓ ఇంజక్షన్ వేసి ఇంటికి పంపాడు. ఇంటికి చేరుకున్న కాసేపటికే ఇంజక్షన్ వేసిన చోట వాపు వచ్చింది. అంతేకాక తలనొప్పి మరింత ఎక్కువ కావడంతో కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రికి పిలుచుకెళ్లారు. పరీక్షించిన అక్కడి వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు నిర్ధారించి, వెంటనే అనంతపురానికి రెఫర్ చేశారు. దీంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక గురువారం ఆమె మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త రవినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆర్‌ఎంపీ వేసిన ఇంజక్షన్ వికటించిండం వల్లనే ఆమె మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

వజ్రకరూరు: మండలంలోని పీసీ.ప్యాపిలి తండాకు ఆదినారాయణ నాయక్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. మూడు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఆదినారాయణ నాయక్ తన వెంట పిలుచుకుని వెళ్లాడు. ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. గురువారం మధ్యాహ్నం పీసీ ప్యాపిలి బస్టాఫ్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న ఆదినారాయణనాయక్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పశుశాఖ పరిధిలో 12 చెక్‌పోస్టులు

- గాలికుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా పశువుల రవాణా, క్రయ విక్రయాలపై ప్రత్యేక నిఘా



పశువుల రవాణా

అనంతపురం అగ్రికల్చర్: పశువులను కబలిస్తూ పాడి రైతులకు నష్టాలు తెచ్చిపెడుతున్న గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీస్– ఎఫ్ఎండీ)ని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ మేరకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ఆయా రాష్ట్రాలకు దిశానిర్దేశం చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని కర్ణాటక సరిహద్దులు పంచుకున్న 12 ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు పశుశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అనంతపురం జిల్లా పరిధిలో బొమ్మనహాల్, డి.హీరేహాల్, మొలకాల్మూరు రోడ్డు, ఓబుళాపురం, డొనేకల్లు, విడపనకల్లు, యాటకల్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో తూముకుంట, కొడికొండ, కె.బసవనపల్లి, మోదా, యు.రంగాపురం గ్రామాల పరిసరాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు కానున్నాయి. రెండు మూడేళ్లలో గాలికుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించి వ్యాధి రహిత ప్రాంతం (ఎఫ్ఎండీ ఫ్రీజోన్)గా ప్రకటించేలా చర్యలు వేగవంతం చేశారు. ఈ క్రమంలో నేషనల్ అనిమల్ డిసీసెస్ కంట్రోల్ బోర్డు (ఎన్ఏడీసీపీ) కింద ఒక్కో చెక్‌పోస్టు ఏర్పాటుకు రూ.10 లక్షలు చొప్పున కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే స్థల సేకరణ పూర్తి కాగా త్వరలో అన్ని వసతులతో కూడిన చెక్‌పోస్టు క్యాబిన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకూ ఎంపీడీవో పరిధిలో పనిచేస్తున్న వీఏహెచ్ఏలను చెక్‌పోస్టుల్లో నియమించనున్నారు. దీంతో వారు పూర్తిగా పశుశాఖ పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుంది. క్రయ విక్రయాలు, రవాణా కింద కర్ణాటక నుంచి తరలిస్తున్న పశువులకు జబ్బులు, రోగాల స్థితిగతులను చెక్‌పోస్టు వద్ద అధికారులు పరిశీలిస్తారు. జిల్లాలోకి పశువులను అనుమతించాలంటే తప్పనిసరిగా ఎఫ్అండ్డీ వ్యాక్సినేషన్‌కు సంబంధించి సర్టిఫికెట్ చూపించాలనే నిబంధన విధించారు. వీటికి సంబంధించి రోజువారీ నివేదిక సంబంధిత పశువుల డాక్టర్‌కు, జేడీకి, డైరెక్టరేట్‌కు, అక్కడి నుంచి కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. తొలి విడతగా 12 చెక్‌పోస్టులకు అనుమతి రాగా త్వరలో కర్ణాటకను అనుకుని ఉన్న మరికొన్ని ప్రతిపాదిత చెక్‌పోస్టుల ఏర్పాటుకు కూడా ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

బెంగళూరులో కళ్యాణదుర్గం యువతి ఆత్మహత్య



రుచిత

దొడ్డబళ్లాపురం (కర్ణాటక): జీవితంపై విరక్తితో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం బెస్తరహళ్లికి చెందిన రుచిత (25) బెంగళూరులోని బయోకాన్ కంపెనీలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోంది. తన తల్లిదండ్రులతో కలసి బాగలగుంటలోని మల్లసంద్రలో నివాసముంటోంది. పీణ్యా 2వ స్టేజ్‌లో తల్లిదండ్రులు ఓ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తల్లిదండ్రులు దుస్తుల దుకాణానికి వెళ్లిన సమయంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న రుచిత ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ క్రమంలో కుమార్తెకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో తల్లిదండ్రులు నేరుగా ఇంటికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న బాగలగుంట పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. డెత్ నోట్ ఏదీ లభ్యం కాకపోవడంతో ఆమె మృతికి కారణాలు తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బాగలగుంట పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధుడి మృతి



తాడిపత్రిటౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి(70) మృతదేహాన్ని గురువారం సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. సెల్‌ఫోన్ ఉన్నా...అందులో ఎలాంటి సమాచారం లేదు. కాగా, మృతుడు యాచకుడని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై ఎస్ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు తాడిపత్రి అర్బన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బంగారు దుకాణంలో చోరీకి యత్నం

శింగనమల: నార్పలలోని బంగారం దుకాణంలో చోరీకి ప్రయత్నించిన మహిళను దుకాణదారుడు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గురువారం ఉదయం కమ్మలు కొనుగోలు చేయడానికి వచ్చిన నార్పల మండలం గడ్డం నాగేపల్లికి చెందిన ఓ మహిళ.. దుకాణదారుడిని ఏమార్చి బంగారు కమ్మలను తస్కరించి, వాటి స్థానంలో గిల్టు నగలు ఉంచింది. విషయాన్ని గుర్తించిన దుకాణ నిర్వాహకుడు సయ్యద్ ఆమెను పోలీసులకు అప్పగించాడు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

27 నుంచి జాతీయ లఘు చిత్రోత్సవం

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా మరో లఘు చిత్రోత్సవానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వచ్చే నెల 2 వరకు సాగే చిత్రోత్సవ పోస్టర్లను పారిశ్రామిక వేత్త ముడార్ సుధీర్, జీఎంఎస్ అధినేత సురేష్, దర్శకుడు రషీద్‌బాషా, సామాజిక సేవా కార్యకర్తలు ఏజీ అనిల్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 7వ అనంత జాతీయ లఘుచిత్రోత్సవం అనంత నుంచి సినీ పరిశ్రమకు వెళ్లిన వారి ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటూ నిత్యం లఘు చిత్రాల ప్రదర్శనలతో కనుల పండువగా సాగుతుందన్నారు. ఈనెల 20 లోపు ఆసక్తి కలిగిన నటీనటులు, కెమెరామెన్, రచయితలు, దర్శకులు, ఎడిటర్లు తదితర 18 విభాగాల్లోని పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ముగింపు రోజున జిల్లా వేదికగా సాగే చిత్రోత్సవంలో వారికి మెమెంటోలు, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడానికి ఈసారి ప్రత్యేకంగా రెండు రోజుల పాటూ స్క్రిప్ట్ రైటింగ్, ఫిల్మ్ మేకింగ్‌పై శిక్షణనివ్వడమే కాకుండా వారితో సందేశాత్మక చిత్రం నిర్మించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7288022467, 9676350681 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తోట బాలన్న, రవీంద్రనాథ్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, కేవీ రమణ, టీవీ, బుల్లితెర నటుడు రమేష్‌నీల్, డాక్టర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన నూతన కార్యవర్గంతో ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని గురువారం అనంతపురంలోని కృషి భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి, కార్యదర్శిగా నరసింహ, సహాధ్యక్షుడిగా ఆనందరాజు, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, నారాయణస్వామి, శివకుమార్, రామలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నాగభూషణం, అనిల్, రాజేష్, మోహన్‌కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా రాజ్యలక్ష్మి, ఖాద్రి, ఈసీ సభ్యులుగా లీలావతి, వెంకటేశ్వర్లు, రహంతుల్లా, రాష్ట్ర ఈసీ సభ్యులుగా శశికళ, హేమంత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర అసోషియేట్ ప్రెసిడెంట్ రూపేష్‌కుమార్, ఆనందరాజు, సురేంద్ర, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, నరసింహ, కడప జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్, ఉమ్మడి జిల్లా నుంచి వ్యవసాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం జేడీఏ ఉమామహేశ్వరమ్మను నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో అనూషకు చోటు



మాల్దీవుల జట్టుతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తలపడిన ఎం. అనూష

అనంతపురం: మండల కేంద్రం ఆత్మకూరుకు చెందిన ఎం.అనూష... భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇప్పటికే అండర్ 20 కేటగిరీలో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో చోటు దక్కించుకున్న అనూష... గురువారం బెంగళూరు వేదికగా మాల్దీవుల జట్టుతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారు. తనదైన ఆట తీరుతో బంతిని శరవేగంగా అందిస్తూ మాల్దీవుల మహిళల ఫుట్‌బాల్ జట్టుపై 11–1 తేడాతో భారత జట్టు ఘన విజయం సాధించడంలో ఆమె కీలకంగా మారారు. దీంతో ప్రధాన జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్న ఆమె ఇకపై అన్ని టోర్నీల్లోనూ ఆడనున్నారు. 2021లో ఫౌండేషన్ లాలిగా సహకారంతో ఆర్డీటీ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ శిక్షణ తీసుకున్న అనూష... భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకోవడంపై ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

చీటింగ్ కేసులో నిందితుల అరెస్ట్

బత్తలపల్లి: మాయమాటలతో రైతులను మోసగించిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వారు వెల్లడించారు. ఫామిడి మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కందింటి కేశవనారాయణ అలియాస్ శ్రీనివాసులు/శివయ్య, ఆయన కుమారుడు కందింటి నరేష్ కొంత కాలంగా బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో తిరుగుతూ పలువురు రైతులను పరిచయం చేసుకున్నారు. తాము ఆవులు, గేదెలు, ఇతర జీవాలను కొనుగోలు చేస్తామంటూ నమ్మి బలికారు. బత్తలపల్లి మండలం గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన బగ్గిరి రామ్మోహన్‌రెడ్డి నుంచి రూ.5 లక్షలు విలువ చేసే ఐదు ఆవులను కొనుగోలు చేశారు. పది రోజులకు డబ్బు చెల్లిస్తామంటూ నమ్మబలికి పత్తా లేకుండా పోయారు. దీంతో బత్తలపల్లిలో వారు నివాసముంటున్న మారుతీనగర్‌కు బాధిత రైతు చేరుకుని ఆరా తీస్తే అప్పటికే వారు ఇల్లు ఖాళీ చేసినట్లుగా చుట్టుపక్కల వారు తెలిపారు. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న రామ్మోహన్‌రెడ్డి గత ఏడాది డిసెంబర్ 27న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో గురువారం నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ఐదు ఆవులు, ఓ గేదెను స్వాధీనం చేసుకున్నారు.

సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం నశించాలి

- నిరసన ర్యాలీలో న్యాయవాదులు



అనంతపురం జిల్లా కోర్టు ఎదుట నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

అనంతపురం: సివిల్ కేసు వ్యవహారాల్లో పోలీసుల జోక్యం నశించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఐదు రోజుల క్రితం అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శాంతిలాల్ ఛాంబర్‌లో సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మృతి చెందిన విషయం తెలిసిందే. విచారణ పేరుతో న్యాయవాది శేషాద్రిని బలిగొన్న సీఐ శాంతిలాల్‌ను సస్పెండ్ చేయాలంటూ న్యాయవాదులు చేపట్టిన నిరసన ర్యాలీ గురువారం ఐదో రోజూ కొనసాగింది. జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన నిరసన ర్యాలీలో సీనియర్ న్యాయవాదులు గోవిందరాజులు, వెంకట్రాముడు, బడా నారాయణరెడ్డి, రామలింగారెడ్డి మాట్లాడారు. శేషాద్రి మృతి కేసు విచారణను సీబీసీఐడీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. శేషాద్రి మృతిపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ గోవింద్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఉమాపతి, హనుమన్న, పుల్లయ్య బాబు, బాలకృష్ణ, రాజారెడ్డి, గడియారం మల్లికార్జున శర్మ, వహీదా, అనురాధ, భాను, బాబా ఫకృద్దీన్, శ్రీనివాసరెడ్డి, సతీష్, వీరమాసప్ప, పురుషోత్తం, రాఘవేంద్ర, పద్మజ, పద్మావతి, లక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి, రేవతి, అవ్వ సురేష్, భరత్, భూషణ్ రెడ్డి, రామకృష్ణ, ఎల్‌కే సురేంద్రనాథ్, శ్రీకాంత్, రాఘవేంద్ర, బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గురువారం జిల్లా న్యాయవాదులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి కర్నూలు జిల్లాలోని అన్ని కోర్టులకు సంబంధించిన బార్ అసోసియేషన్ నాయకులు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. న్యాయవాది బీవీ శేషాద్రి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సీఐను సస్పెండ్ చేసేంత వరకూ ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. అలాగే తమ నిరసనను మరో మూడు రోజులు కొనసాగించాలని న్యాయవాదులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా బార్ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్‌తో కొంత మంది న్యాయవాదులు వాగ్వాదానికి దిగారు. సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి ఘటనపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మీరు ఎటువైపు ఉన్నారు (మీ స్టాండ్ ఏంటి)అని ప్రశ్నించారు. ఇంత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతుంటే మీరు చురుగ్గా ఎందుకు పాల్గొనడం లేదంటూ నిలదీశారు. దీంతో కొందరు న్యాయవాదులు కల్పించుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.